క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 3న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎస్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. పోచమ్మకుంట, శ్రీనగర్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, హనుమాన్ నగర్ డబ్బాల ప్రాంతంలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు, టెంపుల్ ట్రీ విల్లాస్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎల్లాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో..

హసన్‌పర్తి: ఎల్లాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ అశోక్ తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు, రేపు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: ధర్మసాగర్ నుంచి వచ్చే తాగునీటి ప్రధాన పైపులైన్‌కు మరమ్మతుల కారణంగా శుక్ర, శనివారాల్లో వరంగల్ అండర్ రైల్వే గేట్ ప్రాంతంలో తాగునీటి సరఫరా ఉండదని ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. కరీమాబాద్ నాగమయ్య టెంపుల్, నాగేంద్రనగర్, శివనగర్, చింతల్, ఖిలా వరంగల్ తూర్పు కోట, ఖిలా వరంగల్ మధ్యకోట, మైసయ్య నగర్, శాకరాసికుంట ప్రాంతాల్లో నీటి సరఫరా బంద్ ఉంటుందని పేర్కొన్నారు.

నేటి నుంచి డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు

విద్యారణ్యపురి: ఈనెల 3, 4వ తేదీల్లో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు గోదావరిఖనిలో జరగనున్నాయని డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి తిరుపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సభలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్లీనరీ సమావేశాల్లో నిరుద్యోగ భృతి సాధన, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాట కార్యక్రమాల కార్యాచరణను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు.

వీధి నాటక వీరుడు హష్మీ

ఖిలా వరంగల్: వీధి నాటకాన్ని పోరాట ఆయుధంగా మార్చిన వీరుడు హష్మీ అని ప్రజానాట్య మండలి వరంగల్ జిల్లా కార్యదర్శి వి.దుర్గయ్య అన్నారు. పీఎస్ఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ శివనగర్‌లో సఫ్దర్ హష్మీ వర్ధంతి సందర్భంగా హష్మీ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. హష్మీ అభ్యుదయ నాటక రచయిత, దర్శకుడు, నటుడు గీత రచయిత అని దుర్గయ్య కొనియాడారు. కార్యక్రమంలో పీఎస్ఎం జిల్లా నాయకులు రవి, జానీ, రాజు, మొగిళి, అశోక్, రమేష్, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఫిషర్‌మెన్ కమిటీ సభ్యుడిగా మండల సమ్మయ్య



హన్మకొండ అర్బన్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఫిషర్‌మెన్ కమిటీ పాలక మండలి సభ్యుడిగా హనుమకొండకు చెందిన మండల సమ్మయ్యను నియమిస్తూ కమిటీ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ మండలం వడ్డేపల్లికి చెందిన సమ్మయ్య ముదిరాజ్.. కాంగ్రెస్ పార్టీ నుంచి గత గ్రేటర్ ఎన్నికల్లో పోటీ చేశారు. కాగా, తన నియామకానికి సహకరించిన నాయకులకు సమ్మయ్య కృతజ్ఞతలు తెలిపారు.

బీసీటీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా సాంబమూర్తి



కాజీపేట: బీసీ టీచర్స్ యూనియన్ (బీసీటీయూ) వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కాజీపేట పట్టణానికి చెందిన పెరుమాండ్ల సాంబమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నియామక ఉత్తర్వులను ఫాతిమానగర్ కాలనీలో గురువారం అందజేశారు.

ఒడిశా వ్యక్తి అదృశ్యం



మడికొండ: ఒడిశా రాష్ట్రం సుచర్నపూర్ జిల్లా బినిక గ్రామానికి చెందిన సూర్జ్యకార్ (35) అదృశ్యమైనట్లు మడికొండ పోలీసులు తెలిపారు. కాజీపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎండీ.సర్వర్‌కు చెందిన ఇటుకబట్టీలో పని కోసం వచ్చి గతనెల 29న సాయంత్రం బియ్యం తీసుకొస్తానని చెప్పి బయటకు వచ్చి తిరిగి వెళ్లలేదు. భార్య దేవకీకౌర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

సీపీని కలిసిన జనగామ ఏఎస్పీ

వరంగల్ క్రైం: జనగామ డివిజన్ ఏఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పండరి చేతన్ నితిన్ గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి పుష్పగుచ్ఛం అందజేశారు.

కంకర పోసి.. రోడ్డు మరిచారు

- రెండేళ్లగా ప్రయాణికులకు కష్టాలు
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- చోద్యం చేస్తున్న అధికారులు



కంకర పోసి వదిలేసిన రోడ్డు



గుంతల్లో నిలిచిన నీరు

హసన్‌పర్తి: హసన్‌పర్తి – చింతగట్టు మార్గమధ్యలోని రోడ్డు నిర్మాణానికి కంకర పోసి బీటీ రోడ్డు వేయడం మరిచారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రెండేళ్ల క్రితం కార్పొరేషన్ సాధారణ నిధులు రూ.30 లక్షల వ్యయంతో రోడ్డు పనులు చేపట్టారు. సదరు కాంట్రాక్టర్ ఆ నిధులతో కేవలం కంకర పనులు మాత్రమే చేపట్టాడు. దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంకర పోసి అలాగే వదిలేయడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కంకర రోడ్డుపై అక్కడక్కడ గుంతలు ఏర్పడి నీరు నిలుస్తోంది. ఈక్రమంలో ప్రమాదాల్లో ప్రాణాలు పోతున్నా అధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ దారిలో వాహనాల తాకిడి ఎక్కువగా ఉండడంతో దుమ్ముధూళితో స్థానికులు అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అర్ధంతరంగా ఆగిన రోడ్డు పనులను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పనులు పూర్తి చేయాలి



మధ్యలో నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి. కంకర పోసి వదిలిపోయడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు పాడవుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే నాగరాజు దృష్టి సారించి పనులు పూర్తయ్యేలా చూడాలి.

– నద్దునూరి నాగరాజు, చింతగట్టు

విద్యార్థులను తీర్చిదిద్దడంలో టీచర్లదే కీలక పాత్ర

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, టీఎస్ యూటీఎఫ్ బాధ్యులు

విద్యారణ్యపురి: విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలో క్యాంపు కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ రూపొందించిన నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు కిరణ్‌కుమార్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు, బాధ్యులు సీఎస్ఆర్ మల్లిక్, మోజెస్, చంద్రయ్య, ప్రసన్నానంద్, సదానంద్, బ్రహ్మచారి, రామ్మోహన్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నేత బర్ధన్

- సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



న్యూశాయంపేట: అందరికి ఆదర్శప్రాయుడు కమ్యూనిస్టు నేత ఏబీ బర్ధన్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయంలో బర్ధన్ వర్ధంతి సభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్, టి.భిక్షపతి, ఎల్లేశ్, అశోక్‌స్టాలిన్, ఎం.భిక్షపతి, సదానందం, సారంగపాణి, శ్రీనివాస్, రాజు, రాజేందర్ పాల్గొన్నారు.

పేదల పక్షాన బీఆర్ఎస్ లీగల్ సెల్ పోరాటం



బీఆర్ఎస్ లీగల్ సెల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వినయ్‌భాస్కర్, తదితరులు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్

హన్మకొండ: పేదల పక్షాన బీఆర్ఎస్ లీగల్ సెల్ పోరాడుతోందని పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో లీగల్‌సెల్ –2025 క్యాలెండర్, పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ లీగల్ సెల్ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు వినోద్ కుమార్, కమిటీ సభ్యులు శివరాజ్, జనార్దన్ గౌడ్, శ్రీరామ్ కిరణ్, రవి, వేణుపటేల్, శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పులి రజనీకాంత్, వెంకన్న, నయీమొద్దీన్, వెంకటేశ్వర్లు, ఉడుతల సారంగపాణి, కుసుమ లక్ష్మీనారాయణ, జానకీ రాములు, రమేష్, సుంచు కృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవించాలి



కేయూ క్యాంపస్: వృద్ధులను ప్రతిఒక్కరూ గౌరవించాలని, ప్రేమించాలని కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యురాలు, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు సభ్యురాలు డాక్టర్ అనితారెడ్డి సూచించారు. నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా కేయూ సమీపంలోని లార్డ్ వృద్ధాశ్రమంలో వృద్ధులతో కలిసి గురువారం కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరికి కూడా వృద్ధాప్యం శాపంగా మారకూడదన్నారు. ఆశ్రమ నిర్వాహకుడు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప ఇరుముడి పూజలు



ఖిలా వరంగల్: ఇరుముడితో మాలధారులు



కాజీపేట: శబరిమలకు తరలిన మాలధారులు

ఖిలావరంగల్: వరంగల్ రంగశాయిపేట రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అయ్యప్ప గురుస్వామి కే.నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప ఇరుముడి పూజ గురువారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు వెలిదె ప్రదీప్‌శర్మ.. ఇరుముడి పూజ నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మాలధారులు శబరిమలకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కరుణాకర్, రంజిత్, పవన్, భవిత్, శ్రీధర్, రాంబాబు, భిక్షపతి, మాధవ్, మనీ, రాహుల్, మనోహర్, మణిదీప్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో..

కాజీపేట: అయ్యప్పస్వామి దేవాలయ ఆవరణలో గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడి ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల దీక్షలు పూర్తి చేసుకున్న అయ్యప్ప మాలధారులు ఆలయంలో ఇరుముడి ధారణ చేశారు. అనంతరం 25 మంది దర్శనం కోసం శబరిమలకు తరలి వెళ్లారు. పూజలో బుర్ర జనార్దన్ గౌడ్, బంగారు కుమారస్వామి, కోటగిరి సంపత్ కుమార్, విజయ్ కుమార్, సురేష్, పాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి, తదితరులు

హసన్‌పర్తి: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని హుస్నాబాద్ బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ క్యాంపు కార్యాలయంలో ఆయతో కలిసి వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. హనుమకొండ ఆర్టీఏ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన అదనపు డీసీపీ రవి, డీటీసీ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్, డీసీపీ దేవిడ్ రాజు, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, ఎంవీఐ రమేష్‌రాథోడ్, కిశోర్‌బాబు, ఉదయ్ పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన నాయకులు

రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హసన్‌పర్తి మండల కాంగ్రెస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో గురువారం జరిగిన కార్యక్రమానికి హాజరైన సందర్భంగా మంత్రికి బొకే అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్ జె.రవి, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, నాయకుడు తిరుపతి పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో బీజేపీని పటిష్టం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

కాజీపేట: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల వరకు బీజేపీని బూత్ స్థాయిలో మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు అంకితభావంతో, శక్తివంచన లేకుండా పనిచేయాలని ఎన్నికల పరిశీలకుడు కృష్ణమూర్తి సూచించారు. కాజీపేట 62వ డివిజన్ సోమిడిలో కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో దర్గా కాజీపేట ప్రాథమిక సహకార సంఘం సభ్యుడు కాయిత రాజ్‌కుమార్ యాదవ్, భగవాన్‌దాస్ ఉపాధ్యాయ, మేకల శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, అధ్యాపకులు, తదితరులు

కేయూ క్యాంపస్: ఈనెల 4న నిర్వహించనున్న కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం పోస్టర్లను వీసీ ప్రతాప్‌రెడ్డి, అధ్యాపకులు గురువారం ఆవిష్కరించారు. 2017 – 2024 బీటెక్ బ్యాచ్ పూర్వ విద్యార్థినులు సమ్మేళనంలో పాల్గొనాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షాలు కోరారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ వేణుగోపాల్ రెడ్డి, కన్వీనర్ వైష్ణవి పాల్గొన్నారు.

పనిబంధు దీక్షలను జయప్రదం చేయాలి



కార్మికులతో మాట్లాడుతున్న సింగారపు బాబు

రామన్నపేట: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 65 వేల మంది మున్సిపల్ పారిశుద్ధ్య కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్లను క్రమబద్ధీకరించాలని, వారికి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4, 5వ తేదీల్లో నిర్వహించనున్న పనిబంధు దీక్షలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు సింగారపు బాబు పిలుపునిచ్చారు. రామన్నపేటలోని కమ్యూనిటీ హాల్‌లో మున్సిపల్ కార్మికులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు పీపీఈ కిట్లు, షూలు, చెప్పులు, ఇతర పరికరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీఓ నంబర్ 60 ప్రకారం కార్మికులకు జీతాలు పెంచాలని కోరారు. మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీక్షలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు సుమర్, ఖలీమ్, సాంబరాజు, సతీష్, శంకరి, ఇందిర, శిరీష, అనిత, సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.

విద్య, సంస్కారంతోనే మంచి వ్యక్తిత్వం



కార్యక్రమంలో మాట్లాడుతున్న దామోదర్

విద్యారణ్యపురి: విద్యా, సంస్కారంతోనే మంచి వ్యక్తిత్వం పెంపొందుతుందని సీడబ్ల్యూసీ సభ్యుడు, మోటివేషనల్ స్పీకర్ కజాంపురం దామోదర్ అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో గురువారం జరిగిన సంస్కార వికాస శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సంస్కారాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే కష్టపడి చదువుకోవాలన్నారు. పాఠశాల హెచ్ఎం ఉమాదేవి అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగేందర్, బాధ్యులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, బీఈడీ ఛాత్రోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గోదామాధవ కేంద్రంలో గాజుల పండుగ



గాజుల పూజ చేస్తున్న శ్రీనివాసాచార్య

హన్మకొండ కల్చరల్: హనుమకొండ వికాస్‌నగర్‌లోని గోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రంలో గురువారం ఉదయం తిరుప్పావై వ్రత పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం కేంద్రం నిర్వాహకుడు ఆరుట్ల శ్రీనివాసాచార్య స్వామి ఆధ్వర్యంలో ఆపదుద్ధారక స్వామికి ప్రత్యేక అలంకరణ, అష్టోత్తర శతనామార్చనలు, ప్రత్యేక పూజలు, ఆరగింపు, మంగళహారతి నిర్వహించారు. అనంతరం గాజుల పూజ జరిపించారు. అనంతరం మహిళలు రంగురంగుల గాజులు, పండ్లు పసుపు, కుంకుమ, తాంబూలాలు సమర్పించారు. కార్యక్రమంలో వెన్నపురెడ్డి సరళ, శేషుప్రియ, సుధారాణి, విశాలి పాల్గొన్నారు.

బీసీ మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

కేయూ క్యాంపస్: ఈనెల 3న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న బీసీ మహాసభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్వీ నాయకులు కోరారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలోని లైబ్రరీ ఆవరణలో పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కత్తెరపెల్లి దామోదర్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే 194వ జయంతి సందర్భంగా కామారెడ్డి డిక్లరేషన్ అమలు, స్థానిక సంస్థల్లో 42శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మహా నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కేయూ బీఆర్ఎస్వి ఇన్‌చార్జ్ జెట్టి రాజేందర్, బాధ్యులు డాక్టర్ కొమురయ్య, కొనుకంటి ప్రశాంత్, పిన్నింటి విజయ్‌కుమార్, శంకర్, రవి, ప్రవీణ్, అఖిల్, నవీన్, రోహిత్, తిరుపతి, సురేష్, శ్రీరామ్, అనిల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ప్రముఖులను కలిసిన టీజీఓ నాయకులు

హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, ఎంపీ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును టీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా శాఖ అధ్యక్షుడు డి.మురళీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీజీఓ సంఘం కార్యవర్గ సభ్యులు అస్నాల శ్రీనివాస్, కోలా రాజేష్, వరంగల్ శాఖ ప్రధాన కార్యదర్శి ఫణికుమార్, కిరణ్, రాంచందర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, పెద్ది ఆంజనేయులు, శ్రీనివాస్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా టీచర్స్ దినోత్సవంపై హర్షం

కాశీబుగ్గ సెంటర్: జనవరి 3న సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ వరంగల్ జిల్లా శాఖ హర్షం వ్యక్తం చేసింది. మొదటి మహిళ ఉపాధ్యాయురాలిగా సమాజంలో మహిళల విద్య కోసం అనేక ఛీత్కారాలను సైతం ఎదుర్కొని మొక్కవోని ధైర్యంతో అతివల అభ్యున్నతికి సావిత్రిబాయి పూలే పాటుపడ్డారని జిల్లా అధ్యక్షుడు తాటికాయ కుమార్, ప్రధాన కార్యదర్శి సుజన్ ప్రసాద్ కొనియాడారు.

టీఎస్ యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

విద్యారణ్యపురి: టీఎస్ యూటీఎఫ్ రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను కాజీపేట ఎంఈఓ మండల వనరుల కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. కాజీపేట ఎంఈఓ మనోజ్‌కుమార్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సదానందం, బాధ్యులు లింగారావు, బ్రహ్మచారి, రాజేంద్రప్రసాద్, నర్సయ్య, అశ్రఫ్ పాల్గొన్నారు.

కాలనీ కమిటీ క్యాలెండర్ ఆవిష్కరణ



నయీంనగర్: గ్రేటర్ వరంగల్ 53వ డివిజన్ ఆదర్శ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు తూడి విద్యాసాగర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల వేణు, తౌటం నరసింహస్వామి, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

హన్మకొండ అర్బన్: నగరంలోని వడ్డేపల్లికి చెందిన మట్టెపల్లి మోహన్ (బాలయ్య హోటల్) ఇటీవల మరణించగా బాధిత కుటుంబాన్ని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ గురువారం పరామర్శించారు. ఆయన వెంట ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్, జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు బుస్స మల్లేశం, ముదిరాజ్ మహాసభ అర్బన్ ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్, కాంగ్రెస్ నాయకుడు మండల సమ్మయ్య, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎన్పీడీసీఎల్ సీఎండీని కలిసిన ఎస్టీ ఉద్యోగులు



హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డిని ఎస్టీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలిశారు. హనుమకొండ బాలసముద్రంలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీని అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు భూక్య వాలు నాయక్, ప్రధాన కార్యదర్శి అజ్మీర శ్రీరాంనాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.నందా రాథోడ్, డీఈ ఆర్జీ జాటోత్, నాయకులు గురువారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

డీపీఓను కలిసిన ఎంపీఓలు



హన్మకొండ అర్బన్: జిల్లా పంచాయతీ అధికారి రమాకాంత్‌ను మండల పంచాయతీ అధికారులు కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్వీట్లు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. డీఎల్‌పీఓలు గంగా భవాని, షర్ఫొద్దీన్, రఘుపతి రెడ్డి, చేతన్‌రెడ్డి, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల ఉద్యోగి అయిలయ్యకు నివాళి

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో స్టోర్ కీపర్‌గా పనిచేస్తూ కాకతీయ యూనివర్సిటీ ఎంఈఎఫ్ సంఘం నేతగా ఉన్న నర్మెట్ట అయిలయ్య ఇటీవల మరణించారు. ఈమేరకు అయిలయ్య మృతికి సంతాపం తెలుపుతూ కళాశాలలో ఉద్యోగులు అయిలయ్య చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, అధ్యాపకులు, ఉద్యోగులు పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, డాక్టర్ గిరిప్రసాద్, రాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి జీవితంలో రాణించాలి



కాజీపేట: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే శ్రద్ధగా చదివి జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఎస్సై శివకృష్ణ సూచించారు. గంజాయి, డ్రగ్స్, గుట్కా, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. కాజీపేట డంకెన్ బాబా ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం జాగృతి పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. కళాకారులు ఆటపాటలతో సమాజాన్ని పీడిస్తున్న రుగ్మతలపై ఇచ్చిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాబృందం ఇన్‌చార్జ్ నాగమణి, విలియం, వెంకటేశ్వర్లు, పూల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.